క్లుప్తంగా

ఫాగింగ్ యంత్రం వితరణ



ఒంటిమామిడి పంచాయతీకి ఫాగింగ్ యంత్రాన్ని అందజేస్తున్న దివీస్ ప్రతినిధులు

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి పంచాయతీకి దివీస్ ల్యాబొరేటరీస్ సంస్థ ప్రతినిధులు శుక్రవారం ఫాగింగ్ మెషీన్ వితరణ చేశారు. గ్రామంలో దోమల నివారణ కోసం రూ.1.20 లక్షల విలువైన ఫాగింగ్ యంత్రాన్ని దివీస్ ప్రతినిధి బి.వాసుబాబు గ్రామ సర్పంచ్ అంగుళూరి సుధాకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సతీష్, పంచాయతీ శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

అంధులకు స్మార్ట్ కళ్లజోళ్ల పంపిణీ



అంధులకు స్మార్ట్ విజన్ కళ్లజోళ్లను అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

తుని: కంటి చూపు లేని ముగ్గురు అంధులకు స్మార్ట్ కళ్లజోళ్లను పంపిణీ చేసినట్టు తుని రోటరీ క్లబ్ అధ్యక్షుడు మంగరాజు తెలిపారు. వాల్లేరు క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫాస్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు, ప్రాజెక్టు చైర్మన్ విశ్వనాథ్ కంటి చూపులేని అంధులకు రూ.94,500 విలువ చేసే స్మార్ట్ విజన్ కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారన్నారు. తుని రోటరీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేత ఒమ్మంగి జట్టు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల విజేతగా ఒమ్మంగి జట్టు నిలిచింది. ద్వితీయ స్థానంలో ధర్మవరం, తృతీయ స్థానంలో గజ్జనపూడి జట్లు నిలిచాయి. విజేతలకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు బహుమతులు అందజేశారు. బెస్ట్ రైడర్‌గా నిలిచిన ఒమ్మంగికి చెందిన నరేష్‌కు, బెస్ట్ డిఫెండర్‌గా సీహెచ్ సాయికు, బెస్ట్ ఆల్ రౌండర్‌గా కొల్లుబోయిన విష్ణులకు బహుమతులను ప్రదానం చేశారు. యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ముదునూరి సీతారామరాజు, సొసైటీ మాజీ చైర్మన్ జువ్వల బాబులు, వైఎస్సార్ సీపీ నాయకులు నానిపల్లి చంటి, బొల్లు చిట్టిబాబు, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, బొల్లు నాగేశ్వరరావు, బొల్లు రాజబాబు పాల్గొన్నారు.

నూతన బస్సు ప్రారంభం



గోకవరం ఆర్టీసీ డిపోలో నూతన బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో నూతన బస్సును జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి ప్రారంభించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని గోకవరం నుంచి కాకినాడ వెళ్లే నూతన బస్సును ప్రారంభించారు. ఈ బస్సు సర్వీసును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ యు.రామన్న, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రికి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు రాయవరపు శ్రీనివాస్‌రావు సహకారంతో సమకూర్చిన రెండు ఏసీలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై అవగాహన

ప్రత్తిపాడు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై అవగాహన కలిగి ఉండాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కోరారు. ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ, ఓటింగ్ సరళి, ఓటింగ్ ప్రాధాన్యతా క్రమం, ఓటర్ల వివరాల సేకరణ, ఎన్నికల ప్రచార నిర్వాహణ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శింగిలిదేవి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

తొలి అడుగు పడింది

- నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ గిరిబాబు పర్యటన
- మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత ముద్రగడ పద్మనాభంతో కలసి ప్రచారం
- ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు



ములగపూడిలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబులకు హారతులందిస్తున్న మహిళలు

రౌతులపూడి: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ములగపూడి నుంచి పార్టీ ప్రచారానికి శ్రీకారం చుట్టిన ముద్రగడ గిరిబాబుకు, ఆయన తండ్రి, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అడుగడుగునా అభిమానులు నీరాజనం పట్టారు. ములగపూడిలో మాజీ సర్పంచ్ అంకంరెడ్డి సతీష్‌కుమార్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు చింతకాయల వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యాన కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తొలుత గ్రామ ఇలవేల్పు వేములమ్మ తల్లిని దర్శించుకుని, కొబ్బరి కాయలు కొట్టి, ప్రత్యేక పూజలు చేసి, మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి, ఎస్సీ పేటలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గిరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కో ఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ కుటుంబ సభ్యుల ఆశీస్సులు తీసుకుని, వినాయకుడికి కొబ్బరి కాయలు కొట్టి స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ సర్పంచ్ సతీష్‌కుమార్ కుటుంబ సభ్యుల ఆశీర్వాదం తీసుకుని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు, తన తండ్రి, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అండదండలతో నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలను కలుసుకుని వారి సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి ముందడుగు వేస్తానని ఈ సందర్భంగా అన్నారు.



ములగపూడిలో ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును పలకరించి ఆశీస్సులందిస్తున్న గ్రామ పెద్దలు



అన్నవరంలో సత్యదేవుని తొలిపావంచా వద్ద పూజలు చేస్తున్న మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, ముద్రగడ గిరిబాబు

మీ కుటుంబంతో మాకున్న బంధాన్ని గుర్తు చేశావు బాబూ

'మా గ్రామంలో మీ తాతయ్య ముద్రగడ వీరరాఘవరావు, మీ తండ్రి పద్మనాభంతో మాకున్న అనుబంధాన్ని మళ్లీ నీవు గుర్తు చేశావు బాబూ' అంటూ ములగపూడి గ్రామానికి చెందిన పలువురు పెద్దలు గిరిబాబుకు తమ దీవెనలు అందించారు. తమ గ్రామానికి తోడ్పాటునందించి, ప్రజల సమస్యల పరిష్కారానికి సహకరించి, తండ్రికి తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకోవాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, అన్నవరం ట్రస్టుబోర్డు మాజీ డైరెక్టర్లు వాసిరెడ్డి జమీలు, దోశ చిట్టిబాబు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, రౌతులపూడి ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచ్‌లు రాపర్తి రామకృష్ణ, సర్నం శ్రీను, వడ్లశ సత్యనారాయణ, యెనుముల కోటిబాబు, సోమరౌతు తిరుమల వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి

అన్నవరం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేవరకూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జి ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంతో కలిసి నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులతో పరిచయ కార్యక్రమం ప్రారంభించారు. తొలుత అన్నవరంలోని సత్యదేవుని తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టి సత్యదేవునికి పూజలు చేశారు. స్థానిక పార్టీ నాయకులు కార్యకర్తలు ముద్రగడ పద్మనాభం, గిరిబాబులకు ఘనంగా స్వాగతం పలికారు. ముద్రగడ గిరిబాబుకు పండితులు శాలువా కప్పి ఆశీర్వదించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉండి ఆదుకుంటామని ముద్రగడ పద్మనాభం, గిరబాబు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దడాల సతీష్, పంచాయతీ వార్డు సభ్యుడు ఆశీన శ్రీనివాస్, నెల్లిపూడి మాజీ సర్పంచ్ పిర్ల నాగేశ్వరరావు, పార్టీ నాయకులు బదిరెడ్డి గోవింద్, ధోశ చిట్టిబాబు, గొల్లపల్లి కాశీవిశ్వనాథం, బెహరా దొరబాబు, కొండపల్లి అప్పారావు, సరమర్ల మధుబాబు, అల్లాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కిర్లంపూడి: మండలంలోని కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు టోల్‌ప్లాజా మేనేజర్ సురేష్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రహదారి భద్రతా మసోత్సవాల్లో భాగంగా టోల్‌ప్లాజా వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరంలో వైద్యులు జనరల్ చెకప్, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రయాణికులు, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రయాణంలో జాగ్రత్తలు తప్పనిసరి



కత్తిపూడిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న అధికారులు

శంఖవరం: రోడ్డు ప్రయాణం చేసేటప్పుడు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని కాకినాడ ఆర్టీఓ శివారెడ్డి, కత్తిపూడి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ సూచించారు. మండలంలోని కత్తిపూడి జాతీయ రహదారిపై రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో అన్నవరం ఎస్సై హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. వనదుర్గమ్మ ఆలయంలో పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11.20 గంటలకు హోమ గుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు సంతోష్ ఘనపాఠి, వనదుర్గ ఆలయ అర్చకుడు కోట వంశీ, పరిచారకుడు వేణు, వ్రతపురోహితులు చెళ్లపిల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. దేవస్థానం ఈఓ వి.సుబ్బారావు దంపతులు, 50 మంది భక్తులు రూ.750 టిక్కెట్‌తో హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో, తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలో పండితులు కుంకుమపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

గోకవరం: గ్రామంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పెంటపల్లికి చెందిన యువకుడి మృతి చెందాడు. కాగా మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్తులు శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి ఎదుట ధర్నా చేశారు. రెండు రోజుల క్రితం పెంటపల్లికి చెందిన సాత్నబోయిన దుర్గాప్రసాద్ బైక్‌పై వెళుతుండగా మరో బైక్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తికి నియోజకవర్గానికి చెందిన జనసేన నేత మద్దతు ఉందని, అందుకే కేసు నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మృతుడి తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి వద్దకు వచ్చిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిసి పరిస్థితిని వివరించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకుని యువకుడి కుటుంబానికి ఇన్సూరెన్సు వచ్చేలా చూడాలని ఎమ్మెల్యే పోలీసులను ఆదేశించారు. దీనిపై ఎస్సై పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేశామని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.



గోకవరం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న పెంటపల్లి గ్రామస్తులు

బాలికలతోనే దేశానికి ఉజ్వల భవిత



వి.కొత్తూరు కేజీబీవీలో విద్యార్థినులతో కలసి లక్ష్యాల పుష్పాన్ని తిలకిస్తున్న ఉపాధ్యాయులు



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న బాలికలు



జగ్గంపేటలో ర్యాలీ చేస్తున్న అధికారులు, బాలికలు

- ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థినుల ప్రదర్శనలు

తుని రూరల్: మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తుండడంతో దేశ ఉజ్వల భవిష్యత్ బాలికలతోనే ముడిపడి ఉందని వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్ అమృతవాణి అన్నారు. శుక్రవారం విద్యాలయంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థినులు రూపొందించిన భవిష్యత్ లక్ష్యాల పుష్పం విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే లక్ష్యాల వైపు అడుగులు వేయాలన్నారు. దేశ భవిష్యత్ బాలికలపై ఆధారపడి ఉందన్నారు. బాలికలపై జరుగుతున్న అకృత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉన్నత చదువులు చదివి ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లుగా అన్నిరంగాలలో ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆడపిల్లల అభివృద్ధికి దోహదం

గండేపల్లి: ఆడపిల్లల అభివృద్ధికి దోహదపడదామని డిప్యూటీ డీఎంహెచ్ఓ పి.సరిత పేర్కొన్నారు. మండలంలోని మురారి హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల భవిష్యత్, సమాజంలో వారి పాత్ర తదితర అంశాలను వివరించారు. గండేపల్లి పీహెచ్‌సీ వైద్యులు కేవీ నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ ఎన్‌వీఎస్‌బీఆర్ శర్మ, హెచ్ఎం ఎ.అమ్మాజీ, పీహెచ్ఎన్ బి.రూతమ్మ, హెచ్ఎస్ ఎ.చెల్లారావు, హెచ్‌వీ పి.ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి. సునీత ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆడపిల్లలను సమాజంలో చిన్నచూపు చూడటం నేరమన్నారు. ప్రస్తుతం బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం మేనేజర్ ప్రగడ ప్రయోగమూర్తి, అధ్యాపకులు వీరభద్రరావు, మదీన, శ్రీలక్ష్మీ, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: స్థానిక హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకు వెళ్లాలని, విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాలుగు కూడలి రోడ్డులో మానవహారంగా ఏర్పడి బేటి బచావో-బేటి పడావో అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి. ఆదిలక్ష్మి, సీడీపీఓ పూర్ణిమ, జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, సీఐ వైఆర్కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చలో తుని వాల్ పోస్టర్ ఆవిష్కరణ

తుని: ఎస్సీ వర్గీకరణ కోసం వచ్చే నెల 1న తునిలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పలివెల శివమణి మాదిగ కోరారు. శుక్రవారం తుని రాజా రాజ బాబు మున్సిపల్ పార్కులో చలో తుని వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. తుని గొల్ల అప్పారావు సెంటర్లో జరిగే సభకు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మాదిగ, రెల్లి ఉపకులాలకు చెందిన అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. తుని నియోజకవర్గం అధ్యక్షుడు కందూరి ముసలయ్య, పట్టణశాఖ అధ్యక్షుడు కాకడ జ్యోతికుమార్, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు



పెద్దనాపల్లిలో రైతులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

గోకవరం: మండలంలోని తంటికొండలో జిల్లా పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. గోకవరం పశు వైద్యాధికారి డాక్టర్ కె.అనిత పశువులకు నట్టల నివారణ మందులు, వ్యాధి నిరోధక టీకాలు, పశువులలో వచ్చే గర్భకోశ వ్యాధులు, లేగ దూడలలో ఏలిక పాముల నివారణకు మందులు పంపిణీ చేశారు. 32 మంది రైతులకు సంబంధించిన 150 పశువులకు, 550 మేకలు, గొర్రెలు, వంద కోళ్లకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ బర్రే నాగేశ్వరరావు, తంటికొండ దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచన్నదొర, వైస్ఎంపీపీ మడికి మైనర్‌బాబు, బద్దిరెడ్డి అప్పన్నదొర, బద్దిరెడ్డి బాబి, నాగం వెంకటపతి పాల్గొన్నారు.

ఏలేశ్వరం: పశువుల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మండలంలోని పెద్దనాపల్లిలో శుక్రవారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. అనంతరం రైతులకు మందులు పంపిణీ చేశారు. పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలోని కోటనందూరులో దొడ్ల డెయిరీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశు వైద్యం శిబిరం నిర్వహించారు. ప్రొక్యూరిమెంట్ స్టేట్ హెడ్ కె.యుగంధర్ రెడ్డి, పశు వైద్యాధికారి ఏడీ నరేష్, పి.హరిప్రియ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో టీం లీడర్ శ్రీనివాసులు, యూనిట్ ఇన్‌చార్జ్ సత్తిబాబు, నరసింహమూర్తి, సూపర్‌వైజర్ వీరబాబు, రాజు, గంగాధర్, శివ, గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

గ్రోయిన్లు శిథిలం



తాండవ నదిపై శిథిలావస్థలో ఉన్న కామినీడువారి గ్రోయిన్



రైతుల సొంత నిధులతో దిగువాయి గ్రోయిన్‌ను పూడ్చుతున్న దృశ్యం

- ఇసుక తవ్వకాలతో తీవ్ర నష్టం
- ఏటా రైతులకు తప్పని సాగునీటి ఇబ్బందులు
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు
- వేసవిలో మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి

కోటనందూరు: పాలకుల నిరంకుశ వైఖరి, అధికారుల ఉదాశీనత వెరసి తాండవ ఆయకట్టు రైతాంగం పాలిట శాపంగా మారింది. మెట్ట ప్రాంతంలో వృథానీటిని ఒడిచిపట్టి రైతులకు సాగునీరుగా అందించేందుకు బ్రిటీష్‌వారి కాలంలో తాండవ నదిపై గ్రోయిన్లు నిర్మించారు. కాల క్రమంలో రెండు దశాబ్దాల క్రితం నాటికే ఈ గ్రోయిన్లు శిథిలావస్థకు చేరాయి. అప్పటినుంచి వీటి అభివృద్ధికి ఏటా ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయడం, సక్రమంగా వినియోగించకపోవడం వల్ల ప్రభుత్వ నిధులు నీటిలో కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. ఫలితంగా బ్రిటీష్‌కాలం నాడు నిర్మించిన గ్రోయిన్లకు కళతప్పింది. ఈ దుస్థితికి ప్రధాన కారణం తాండవ నదిలో గ్రోయిన్ల చెంత యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరపడమే. అధికారుల కళ్ల ముందే ఇసుక మాఫియా రెచ్చిపోతున్నా ..ఆ వైపు కన్నెత్తి చూడలేని దయనీయ పరిస్థితి అధికారులది. మండల రైతాంగం రెండు దశాబ్దాలుగా నెత్తి, నోరు కొట్టుకున్నా ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో అధికారులు ఇసుక అక్రమాలను అడ్డుకోలేకపోతున్నారు. దీంతో గ్రోయిన్ల క్రింద ఉన్న వేల ఎకరాల పంట పొలాలు బీడు వారుతున్నాయి. వర్షాలు తొలగి వేసవి సమీపిస్తున్న తరుణంలో గ్రోయిన్ల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

30 వేల ఎకరాల ఆయకట్టు

తాండవ జలాశయం పరిధిలో తుని నియోజకవర్గంలో 30 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో 18 వేల ఎకరాల ఆయకట్టుకు తాండవ జలాశయం నుంచి కోటనందూరు, భీమవరపుకోట, ఇండుగపల్లి మేజర్, మైనర్ కాలువల ద్వారా సాగునీరు అందిస్తున్నారు. మిగిలిన 12 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు ఆరు దశాబ్దాల క్రితం తాండవ నదిపై అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలో నిమ్మకట్టుతో పాటు మండలంలోని అల్లిపూడి, కోట్టాం, కోటనందూరు, కామినీడు, దిగువాయి గ్రోయిన్లు నిర్మించారు. రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ గ్రోయిన్ల పరిసర ప్రాంతంలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరపడంతో గోయిన్లు శిథిలమైపోయాయి. ఈ దుస్థితితో రైతులకు సాగునీరు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా రైతులు సాగునీటికోసం అష్టకష్టాలు పడక తప్పడం లేదు. నదిలో నీటిని గ్రోయిన్ల ద్వారా పొలాలకు మళ్లించకపోతే పంటలు ఎండిపోతాయి.

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

ప్రజా జీవితానికి ఇబ్బంది లేకుండా తాండవనది నుంచి ఇసుక తవ్వకాలు జరుపుకోవచ్చనేది ప్రభుత్వ నిబంధన. చాలా కాలంగా అందుకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. తాజాగా ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అందుబాటులోకి తీసుకొచ్చినప్పటికీ స్థానికంగా ట్రాక్టర్‌కు రూ.500 వరకూ వసూలు చేస్తుండడంతో ఇసుకమాఫియా తాండవనదిని అడ్డూఅదుపు లేకుండా కొల్లగొట్టేస్తున్నారు. ఒకప్పుడు దోబీలు తాండవనది ఒడ్డున దుస్తులు ఉతుక్కునేవారు. ప్రస్తుతం ఇసుక తవ్వకాలతో నదిపొడవునా భారీగా గోతులు పెట్టేయడంతో దోబీలు దుస్తులు ఉతకడం, రైతులు నదిని దాటి వ్యవసాయ మకాలకు వెళ్లడం కనుమరుగయ్యాయి. కనీసం నది ఒడ్డుకు వెళ్లేందుకు ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

అధికార పార్టీ నేతలే కాంట్రాక్టర్లు

గత చరిత్ర గమనిస్తే శిథిలమైపోతున్న గ్రోయిన్లను నిర్మించేందుకు అధికార పార్టీ నేతలే కాంట్రాక్టర్లుగా వ్యవహరించారు. కంటి తుడుపు చర్యగా నాసిరకం మెటీరియల్‌తో లోపభూయిష్టంగా చేసిన పనులు ఏడాది లోపే ఏటిలో కొట్టుకుపోయేవి. మళ్లీ ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులు గోల చేయడం, అధికారులు ప్రణాళికలు తయారు చేయడం, ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పరిపాటిగా మారింది. ఇలా ప్రతి ఏడాది గ్రోయిన్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.కోట్లు నిధులు మంజూరు చేయడం, సాగునీటి కోసం రైతులు ఇబ్బంది పడడం రివాజుగా మారింది. ఇప్పటికీ ఏటా ఖరీఫ్‌కు ముందు అన్నదాతలు గ్రోయిన్ల దగ్గర ఇసుక బస్తాలు వేసుకొని సాగునీటిని మళ్లించుకునే దయనీయ పరిస్థితులు కొనసాగుతున్నాయి.

గ్రోయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి



తాండవ నదిలో అడ్డగోలుగా జరుపుతున్న ఇసుక తవ్వకాల కారణంగా రూ.కోట్లతో నిర్మించిన గ్రోయిన్లు శిథిలమయ్యాయి. గ్రోయిన్లు సక్రమంగా లేక ఏటా సాగునీటి కోసం ఇబ్బంది పడాల్సిన దుస్థితి. రూ. వేలల్లో పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరిపంట నీరందక ఎండిపోయే పరిస్థితులు ఏటా ఎదురవుతున్నాయి. పట్టించుకోవాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. గ్రోయిన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

రామనూరి సత్యనారాయణ,
రైతు, బొద్దవరం